సాక్షి విశాఖపట్నం

శనివారం । 24 । మే । 2025



అదృశ్యం కాదు.. హత్య!
- మిస్టరీ వీడిన వివాహిత మిస్సింగ్ కేసు
- రియల్ ఎస్టేట్ వ్యాపారి దివాకర్ అరెస్ట్

10లో



యోగా దినోత్సవం నేపథ్యంలో ఆర్కే బీచ్ రోడ్డులో యోగాసనాలతో శిక్షకులు, అభ్యాసకులు సందడి చేస్తున్నారు. వివిధ ఆసనాలు వేస్తూ యోగా డే ముందస్తు వేడుకలకు తాము సిద్ధమని చాటిచెబుతున్నారు. ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

విమ్స్, కేజీహెచ్‌లో కోవిడ్ వార్డు



వైద్య సిబ్బందితో కోవిడ్ వార్డు పరిశీలిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

ఆరిలోవ/మహారాణిపేట: నగరంలో కోవిడ్ కలకలం రేపుతుండటంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా, విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో శుక్రవారం 20 పడకలతో కూడిన ప్రత్యేక కోవిడ్ వార్డును సిద్ధం చేశారు.విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు వార్డును పరిశీలించి, పడకలు, ఆక్సిజన్ యంత్రాలను తనిఖీ చేశారు. కొత్త కోవిడ్ వేరియంట్లైన జేఎన్-1, ఎల్ఎఫ్7, ఎన్బీ 1.8 పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోవిడ్ పరీక్షల కోసం రాపిడ్ కిట్లు అందుబాటులో ఉన్నాయని, పాజిటివ్ వస్తే వెంటనే ఆర్టీపీసీఆర్ పరీక్షలకు పంపిస్తామని తెలిపారు. కేజీహెచ్‌లో 20 పడకలతో కోవిడ్ వార్డును సిద్ధం చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. ఈ వార్డుకు అవసరమైన పడకలు, ఆక్సిజన్, వెంటిలేటర్లు అందుబాటులో ఉంచామన్నారు.

పోలీస్ శాఖకు దివీస్ డ్రోన్లు



సీపీ బాగ్చికి డ్రోన్లు అందజేస్తున్న దివీస్ జీఎం కోటేశ్వరరావు

విశాఖ సిటీ: దివీస్ ల్యాబ్స్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా విశాఖ నగర పోలీస్ శాఖకు రెండు అత్యాధునిక డ్రోన్‌లను అందజేసింది. ఈ డ్రోన్‌లను సీపీ శంఖబ్రత బాగ్చికి అందజేశారు. ఈ డ్రోన్‌లలో హెచ్చరికలు, సూచనలు చేసే లౌడ్‌స్పీకర్, డే అండ్ నైట్ విజన్ కెమెరా, 5 కిలోమీటర్ల పరిధి, 45 నిమిషాలకు పైగా ఎగిరే సమయం, డిటెక్షన్, రికగ్నిషన్, ఐడెంటిఫికేషన్, లైవ్ స్ట్రీమింగ్ కనెక్టివిటీ, సెర్చ్‌లైట్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులతో పాటు దివీస్ జీఎం వై.ఎస్.కోటేశ్వరరావు, లైజన్ కన్సల్టెంట్ ఎం.ఎన్.వరహాలరెడ్డి, సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు సర్వం సిద్ధం




మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

విశాఖ విద్య: ఈ నెల 25న జరగనున్న సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. నగరంలోని 19 పరీక్షా కేంద్రాల్లో 8,424 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాల్లో జామర్లు, తాగునీరు, టాయిలెట్లు వంటి కనీస వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. యూపీఎస్సీ పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని, ఏమైనా సమస్యలుంటే తెలియజేయడానికి కంట్రోల్ రూమ్ (నం. 0891-2590100, 0891-2590102) ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 వరకు రెండు సెషన్లలో జరుగుతుంది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, యూపీఎస్సీ డైరెక్టర్ పట్నాయక్ సమావేశంలో పాల్గొన్నారు.

మిస్సింగ్ మిస్టరీ

ఫేస్‌బుక్‌లో పరిచయమైన వ్యక్తి తియ్యని మాటలకు ప్రే'మాయ'లో పడిపోయి ఒకరు.. వివాహేతర సంబంధంతో పిల్లలను తీసుకొని మరొకరు.. తల్లిదండ్రులు మందలించారని ఇంకొకరు.. ఇలా విశాఖలో వరుసగా మహిళల అదృశ్య సంఘటనలు కలవరం రేపుతున్నాయి. దాదాపుగా ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట మహిళలు మాయమవుతూనే ఉన్నారు. బాలికల నుంచి వివాహితుల వరకు వయోభేదాలు లేకుండా కనిపించకుండా పోతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారు.. తిరిగి ఇంటికి చేరకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వీరి కోసం కుటుంబసభ్యులు.. సమీప బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో చివరకు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో మిస్సింగ్ కేసుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. గత ఐదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా కేవలం నాలుగు నెలల్లోనే 175 మంది మహిళలు అదృశ్యమైనట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.



- విశాఖలో పెరుగుతున్న మహిళల అదృశ్యం కేసులు
- 4 నెలల్లో 175 మంది మాయం
- ఇప్పటి వరకు 133 మంది ఆచూకీ లభ్యం
- మిస్టరీగానే 42 మంది మహిళల అదృశ్యం
- ప్రేమ, వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలే కారణం



విశాఖ సిటీ: విశాఖ నగరంలో మహిళల అదృశ్యాలకు ప్రధానంగా ప్రేమ వ్యవహారాలు, వివాహేతర సంబంధాలే కారణమని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కనిపించకుండా పోయిన యువతుల్లో ఎక్కువ మంది ప్రేమించుకోవడం, ప్రేమికుడిని దక్కించుకోవడం కోసమే ఇంటి నుంచి వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది.


అలాగే మధ్య వయస్కులైన మహిళలు కూడా వివాహేతర సంబంధాల కారణంగా కుటుంబాన్ని వదిలి వెళ్తున్నారు. మిస్సింగ్ కేసుల్లో సుమారు 75 శాతం వరకు ఈ రెండు కారణాలే ఉన్నాయని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఇది నగరంలో పెరుగుతున్న ఆందోళనకరమైన ధోరణిగా మారింది.

175 మంది మాయం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మిస్సింగ్ కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయి. గత ఐదేళ్లలో ప్రతి ఏటా 50 నుంచి 186 కేసులు వరకు రాగా.. ఈ ఏడాది నాలుగు నెలల్లోనే 175 కేసులు నమోదవడం విశాఖ పరిస్థితికి అద్దం పడుతోంది. జనవరిలో 37, ఫిబ్రవరిలో 49, మార్చిలో 43, ఏప్రిల్‌లో 46 మంది అదృశ్యమయ్యారు. వీరిలో 133 మంది ఆచూకీని పోలీసులు గుర్తించారు. వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇంకా 42 మంది ఆచూకీ తెలియరాలేదు. దీంతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. వీరు ప్రేమ, ఇతర కారణాలతో కావాలనే వెళ్లిపోయారా? లేదా ఏదైనా దురదృష్ట సంఘటన జరిగిందా? అన్నది తెలియాల్సి ఉంది. మిస్సింగ్ కేసుల పరిష్కారం కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

పోలీసులకు సవాల్

వీరిని పట్టుకోవడం పోలీసులకు సైతం సవాలుగా మారుతోంది. కొంతమంది ఆచూకీ తెలుసుకున్నప్పటికీ.. మేజర్లు, చట్టాలు, హక్కులు పేరుతో పోలీసులకు కూడా చుక్కలు చూపించిన సంఘటనలు ఉన్నాయి. ఇటువంటి కేసుల్లో అదృశ్యమైన వారి ఆచూకీని పోలీసులు గుర్తించడం మినహా వారిని కుటుంబ సభ్యులకు అప్పగించడం కూడా ఒక పెద్ద సమస్యగా మారుతోంది.





అనాథ బాలలకు ఆధార్ కార్డులు

- జడ్జి సన్యాసినాయుడు



విశాఖ లీగల్ : అనాథలు, వృద్ధులు, వితంతువులకు ఆధార్ కార్డులు అందించాలని విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యాలయంలో అంగన్‌వాడీ, ఐసీడీఎస్ తదితర సంస్థలతో నిర్వహించిన అవగాహన శిబిరంలో ఆయన మాట్లాడారు. ఐసీడీఎస్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు వీరికి తక్షణమే ఆధార్ కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమగ్ర శిశు సంక్షేమ శాఖ, జిల్లా విద్యాశాఖ, జిల్లా బాలల అభివృద్ధి ప్రాజెక్టు, స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసి అర్హులకు వెంటనే ఆధార్ కార్డులు మంజూరు చేయాలని న్యాయమూర్తి వివరించారు.

29న విశాఖ కేంద్రంగా పీఆర్ ప్రాంతీయ సదస్సు

మహారాణిపేట: ఈ నెల 29న విశాఖలో పంచాయతీరాజ్‌పై ఆరు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, గోవా, నాగాలాండ్, లడఖ్, మేఘాలయ) ప్రాంతీయ సమావేశం జరగనుంది. 2025-26 సంవత్సరానికి సంబంధించిన పంచాయతీరాజ్ పథకాలపై అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు, ఈ రాష్ట్రాల పంచాయతీరాజ్ కమిషనర్లు, ప్రభుత్వ కార్యదర్శులు, ఇతర సీనియర్ అధికారులు హాజరు కానున్నారు.

సక్రమంగా రేషన్ సరకులు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న డీఎస్‌వో భాస్కరరావు

మహారాణిపేట: జూన్ నెల నుంచి రేషన్ సరుకుల పంపిణీని సక్రమంగా నిర్వహించాలని పౌర సరఫరాల శాఖాధికారి వి. భాస్కర్ డీలర్లను ఆదేశించారు. శుక్రవారం డీఎస్‌వో కార్యాలయంలో జరిగిన చౌకధరల దుకాణాల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, నిత్యావసర వస్తువుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎస్‌వోలు, డీలర్లు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ఆధ్వర్యంలో 'స్మార్ట్ ఎనర్జీ మీటర్ టెక్నీషియన్' కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి.ఎస్.ఎస్. రవికుమార్ శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం ఎలక్ట్రికల్ రంగంలో అనుభవం ఉన్న అభ్యర్థులు ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చు. పదో తరగతి, ఐటీఐ లేదా డిప్లొమా ఉత్తీర్ణులై, 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు ఉన్నవారు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పది రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం సంబంధిత రంగాల్లో ప్రైవేటు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. వివరాల కోసం 93944885164 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

● మాస్క్‌తో రక్షణ





కోవిడ్ మరోసారి ఆందోళన కలిగిస్తుండటంతో నగరంలో ప్రజలు అప్రమత్తమవుతున్నారు. రోజువారీ జనజీవనంలో మాస్కులు మళ్లీ భాగమయ్యాయి. కొత్త వేరియంట్ల వ్యాప్తి నేపథ్యంలో, తమ ఆరోగ్యాన్ని, ఇతరుల భద్రతను దృష్టిలో ఉంచుకొని చాలా మంది మాస్కులు ధరిస్తూ కనిపిస్తున్నారు. ఇది కోవిడ్ పట్ల పెరుగుతున్న అవగాహన, స్వీయరక్షణ చర్యలకు నిదర్శనం.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

చందనోత్సవం ఘటనకు మంత్రుల కమిటీదే బాధ్యత



అప్పన్న సన్నిధిలో మాజీ దేవదాయశాఖమంత్రి కొట్టు సత్యనారాయణ

సింహాచలం: చందనోత్సవం రోజున సింహాచలం కొండపై ఏడుగురు భక్తులు మృతి చెందిన ఘటనకు కూటమి ప్రభుత్వ మంత్రుల కమిటీ బాధ్యత వహించాలని మాజీ దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఏర్పాట్లపై మైక్రో లెవెల్‌లో జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పుకున్న మంత్రులు, భక్తుల మృతికి కూడా బాధ్యత తీసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు రెండు చందనోత్సవాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించామని, 1.60 లక్షల మంది భక్తులకు నిజరూప దర్శనం కల్పించామని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పనిచేయడం లేదని, పాలనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. అమరావతి, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, తమ వారికి లాభాలు చేకూర్చే విధంగానే కూటమి ప్రభుత్వ పాలన ఉందని విమర్శించారు.

ఏయూ జర్నలిజంలో వార్..!

- హెచ్‌వోడీ బాధ్యతలు తొలగింపుపై ఫిర్యాదు
- రంగంలోకి జాతీయ మైనార్టీ కమిషన్

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ జర్నలిజం విభాగంలో జరుగుతోన్న కోల్డ్‌వార్ రచ్చకెక్కింది. విభాగాధిపతి బాధ్యతల నుంచి అన్యాయంగా తొలగించారంటూ ఆచార్య వినయ్ కుమార్ చేసిన ఫిర్యాదుతో జాతీయ మైనార్టీ కమిషన్ రంగంలోకి దిగింది. దీనికి సంబంధించిన సమగ్ర వివరాలను తమకు అందజేయాలని జాతీయ మైనార్టీ కమిషన్ జాయింట్ సెక్రటరీ వర్సిటీ వీసీకి లేఖ రాసినట్లు తెలిసింది. సమగ్ర వివరాలను 21 రోజుల్లో అందజేయాలని వీసీని ఆదేశించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కోర్సు కౌన్సిల్ నిర్ణయాలను పక్కనపెట్టి, విభాగంలో అవసరం లేకున్నా, గెస్ట్ ఫ్యాకల్టీల నియామకం జరిగిందని, ఈ నేపథ్యంలోనే తనను ఉన్న ఫలంగా హెచ్‌వోడీ బాధ్యతల నుంచి తప్పించారనే అంశాలపై ఆయన కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇది పరిపాలనా దుర్వినియోగం, అవినీతి సంబంధిత అంశంగా కమిషన్ పేర్కొంది. గత వీసీ హయాంలో జరిగిన ఈ విషయంపై ప్రస్తుత వీసీ ఆచార్య రాజశేఖర్ ఎలా స్పందిస్తారోనని వర్సిటీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి భారీ ఏర్పాట్లు

మహారాణిపేట: నగరంలో జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం వద్ద ప్రధాన వేదికతో పాటు, పార్క్ హోటల్ వరకు విస్తరించి ఉండే ప్రాంతంలో సుమారు 50,000 మంది యోగాలో పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో 1,000 మంది చొప్పున కూర్చునేలా 200 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో ఏర్పాట్లు చేయాలని, అందుకు సంబంధించిన మ్యాప్‌లను సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో 2.50 లక్షల మంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. గూగుల్ మ్యాప్ ద్వారా ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు అనువైన ఖాళీ ప్రదేశాలను పరిశీలించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, జీవీఎంసీ, పోలీస్ శాఖ, పలువురు జిల్లా స్థాయి అధికారులు, జోనల్ కమిషనర్లు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలతో ఎంటీఎస్ టీచర్లు బలి..!

- ఖాళీల జాబితాలో వారు పనిచేస్తున్న స్కూళ్లు
- మళ్లీ ఏజెన్సీ బాట తప్పదని ఆందోళన
- భద్రత, కనీస అలవెన్సులకు నోచుకోని వైనం
- ఉమ్మడి విశాఖలో 620 మంది ఎంటీఎస్ టీచర్లు



శిక్షణ పొందుతున్న డీఎస్సీ-98 ఉపాధ్యాయులు (ఫైల్)

విశాఖ విద్య: దశాబ్దాల పోరాటంతో కొలువు దక్కించుకున్నామనే ఆనందం మినిమమ్ టైం స్కేల్(ఎంటీఎస్)తో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎన్నో రోజులు మిగల్లేదు. కొన్నాళ్లు ఏజెన్సీలో పనిచేస్తే ఆ తర్వాత స్వగ్రామాలకు సమీపంలో పోస్టింగ్ ఇస్తామని చెబితే ఉద్యోగాల్లో చేరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యోగాలు ఇచ్చారనే ఏకైక కారణంతో కూటమి ప్రభుత్వం విషం కక్కుతోంది. టీచర్ల బదిలీలకు తెరలేపిన ప్రభుత్వం, ఎంటీఎస్ టీచర్లను గాల్లోపెట్టి, వారు పనిచేస్తున్న స్థానాలను ఖాళీలుగా చూపించారు. దీంతో మళ్లీ ఎక్కడికి పోవాలో తెలియక సతమతమవుతున్నారు.

న్యాయ చిక్కుల్ని పరిష్కరించి..

న్యాయపరమైన సమస్యల్ని పరిష్కరించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో డీఎస్సీ-98 సెలక్టెడ్ అభ్యర్థులు 324 మంది, డీఎస్సీ-2008 అభ్యర్థులు 296 మందికి ఎంటీఎస్ ప్రాతిపదికన ఉద్యోగాలిచ్చారు. డీఎస్సీ-2008 వారికి మైదాన ప్రాంతంలోనే పోస్టింగ్‌లు ఇచ్చారు. డీఎస్సీ-98కి చెందిన 93 మందిని మైదాన ప్రాంతంలో, మిగిలిన 231 మందిని అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ మండలాలకు కేటాయించారు. 98 డీఎస్సీకి చెందిన వారిలో కొందరు ఇప్పటికే రిటైర్ కూడా అయ్యారు.

జీతం మినిమం.. పని మాగ్జిమం

రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా ఎంటీఎస్ ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు రూ.32,470లు వేతనం చెల్లిస్తున్నారు. దీంతో సొంత మండలాలు, లేదా సమీప మండలాల్లోని స్కూళ్లలోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని నాటి ప్రభుత్వం ఆదేశించింది. కానీ మైదాన ప్రాంతంలో అన్ని ఖాళీలు లేనందున చాలా మందిని ఏజెన్సీలో నియమించారు. దశల వారీగా వారిని మైదాన ప్రాంతానికి తీసుకురావాలని అప్పటి ప్రభుత్వం విద్యాశాఖాధికారులకు దిశా నిర్దేశం చేసింది.

ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలో..

డీఎస్సీ-98 ఎంటీఎస్ టీచర్లను 2023లో కౌన్సిలింగ్ ద్వారా స్కూళ్లు కేటాయించారు. 2024లో ఎక్కడివారిని అక్కడే రెన్యువల్ చేశారు. ప్రస్తుతం టీచర్ల బదిలీల నేపథ్యంలో 620 ఎంటీఎస్ స్థానాలను ఖాళీలుగా చూపారు. దీంతో రెగ్యులర్ టీచర్లు కోరుకోగా మిగిలిన ఖాళీలు మాత్రమే వీరికి దక్కనున్నాయి. ఈ నేపథ్యంలో బదులు తెరిచాక.. ఎక్కడికి వెళ్లాల్సి వస్తుందో తెలియని అయోమయంలో ఎంటీఎస్ టీచర్లున్నారు.

పోస్టింగ్ ఎక్కడిస్తారో..



మా కుటుంబం ఉండేది విశాఖలోని ఎన్ఏడీ. ప్రస్తుతం అల్లూరి జిల్లాలోని డుంబ్రిగుడ మండలం పరిడి గిరిజన ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్నా. లా చదివినా, ఉపాధ్యాయ వృత్తిపై ఇష్టంతో ఇందులో చేరా. కానీ.. తీసుకొచ్చి ఏజెన్సీలో పడేశారు. ఈ ఏడాదైనా మా జిల్లాలో పోస్టింగ్ ఇస్తారని ఆశగా ఎదురుచూస్తున్నా.

– దాట్ల లక్ష్మీదేవి

రిటైరయ్యే ముందైనా..



మాది విశాఖ జిల్లా అగనంపూడి. ఆగస్టులో రిటైర్ అయిపోతా. ముంచంగిపుట్ మండలం కెందుగుడ మండల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నా. ఈ ఏడాది పోస్టింగ్ ఎక్కడిస్తారో కూడా తెలియట్లేదు. రెండు నెలల కోసం మళ్లీ మకాం మార్చాల్సిందేనా. కనీసం.. రిటైరయ్యే ముందైనా విశాఖ జిల్లాలో పనిచేసే అవకాశం ఇవ్వాలి.

– ఎం.అనిత

ప్రభుత్వ శాఖల్లో బదిలీల సందడి

- ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి
- సిఫార్సు లేఖలకు ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు

మహారాణిపేట: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీల జాతర మొదలైంది. దాదాపు అన్ని విభాగాల్లోనూ స్థానచలనాలకు రంగం సిద్ధమవడంతో ఉద్యోగుల్లో ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా ఒకే స్థానంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో.. ఆయా ఉద్యోగుల జాబితాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. అయితే కచ్చితంగా ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు పరిమిత సంఖ్యలోనే ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. ఇదిలా ఉండగా పలు కీలకమైన, ఆదాయం వచ్చే స్థానాలను దక్కించుకునేందుకు కొందరు అధికారులు, సిబ్బంది ఇప్పటి నుంచే ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పైరవీలకు తెరలేపినట్లు తెలుస్తోంది.

జూన్ 2వ తేదీ నాటికి పూర్తి : వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల బదిలీలపై గతంలో ఉన్న నిషేధాన్ని ఎత్తివేసిన కూటమి ప్రభుత్వం.. ఈ ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ బదిలీల ప్రక్రియను జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో అనేక శాఖల్లో ఇప్పటికే బదిలీల కసరత్తు మొదలైంది.

సిఫార్సుల కోసం తీవ్ర యత్నాలు : ఆశించిన, ముఖ్యంగా ఆదాయదాయకమైన పోస్టులను దక్కించుకోవడానికి అధికారులు, సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు పొందడానికి నానా తంటాలు పడుతున్నారు. ఎలాగైనా పలుకుబడి ఉపయోగించి 'మంచి' పోస్టింగ్ సంపాదించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ప్రధానంగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, జలవనరుల శాఖల్లోని ఇంజినీర్లు, ఈవోఆర్డీ, సబ్-రిజిస్ట్రార్లు వంటి పోస్టులకు తీవ్రమైన గిరాకీ ఏర్పడింది. ఈ పోస్టులకు ఉన్న 'డిమాండ్' దృష్ట్యా, కొందరు ఎంతటి ఖర్చుకైనా వెనుకాడటం లేదన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా విశాఖపట్నం వంటి నగరాల్లోని పోస్టింగ్‌లకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో.. అక్కడ 'రేట్లు' కూడా అదే స్థాయిలో పలుకుతున్నాయన్నది బహిరంగ రహస్యం. మొత్తం మీద ఈ బదిలీల జాతరలో సిఫార్సులు, పైరవీలదే కీలకపాత్ర పోషించేలా కనిపిస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అదృశ్యం కాదు.. హత్య!

- వివాహిత మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది
- మూడున్నరేళ్ల తర్వాత వెలుగులోకి వచ్చిన ఘోరం
- కుమార్తె పోరాటంతో కదిలిన డొంక
- రియల్ ఎస్టేట్ వ్యాపారి దివాకర్ అరెస్ట్


పల్లా గీత (ఫైల్)

అల్లిపురం: మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది. దాదాపు మూడున్నరేళ్ల కిందట అదృశ్యమైన వివాహిత పల్లా గీత(45) హత్యకు గురైనట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి అలుగు దివాకర్‌ను అరెస్ట్ చేశారు. మృతదేహాన్ని తరలించిన కారును స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. మరో నిందితుడు వరప్రసాద్ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ ఈ వివరాలు వెల్లడించారు.

ఇదీ కేసు

మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న పల్లా గీత 2021 డిసెంబర్ 21న అదృశ్యమైనట్లు ఆమె కుమార్తె ఆబోతు సునీత 2022 జనవరిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు 'వుమెన్ మిస్సింగ్'కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఆమె ఆచూకీ లభించకపోవడంతో 2022 అక్టోబర్‌లో కేసును 'అన్‌డిటెక్టెడ్'గా మూసివేశారు. తన తల్లి ఆచూకీ దాదాపు మూడున్నరేళ్లుగా తెలియకపోవడం.. తనకు న్యాయం జరగలేదని ఆవేదన చెందిన సునీత ఈ ఏడాది మే మొదటి వారంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని కలిసి అభ్యర్థించారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు సీసీఆర్ ఇన్‌స్పెక్టర్ షేక్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి, కేసును పునఃవిచారణ చేపట్టారు.

దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన నిజాలు

ప్రత్యేక బృందం పది రోజుల్లోనే కేసు మిస్టరీని ఛేదించింది. పలు ప్రదేశాలను సందర్శించి, అనేక మంది సాక్షులను విచారించి, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి, గీత హత్యకు గురైందని తేల్చారు. గీతతో సన్నిహితంగా ఉన్న అలుగు దివాకర్ ఆమెను పాశవికంగా హత్య చేసి.. ఏమీ తెలియనట్లు సమాజంలో తిరుగుతున్నాడని పక్కా ఆధారాలు సేకరించి అరెస్ట్ చేశారు.


తూ.గో జిల్లా ఎర్రవరంలోని ఎర్రకాలువ


మృతదేహాన్ని తరలించింది ఈ కారులోనే..

హత్యకు దారితీసిన పరిస్థితులివీ..

భర్తతో విభేదాల కారణంగా పిల్లలను అతని వద్దే విడిచిపెట్టి.. మెలోడీ థియేటర్ ఎదురుగా తన తల్లిదండ్రుల ద్వారా వచ్చిన ఫ్లాట్‌లో గీత ఒంటరిగా నివసిస్తూ రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పనిచేసేది. ఫ్లాట్ నిర్మాణ సమయంలో బిల్డర్‌తో వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో దివాకర్ సహాయం చేయడంతో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. కృతజ్ఞతతో గీత తన ఫ్లాట్‌లోని ఒక గదిని దివాకర్‌కు రియల్ ఎస్టేట్ ఆఫీస్ కోసం ఇచ్చింది. ఆమె దివాకర్‌ను నమ్మి అతను చెప్పిన కొంత మందికి లక్షల్లో అప్పు ఇచ్చింది. ఈ క్రమంలో వారి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. దీంతో పెళ్లి చేసుకోవాలని దివాకర్‌ను గీత ఒత్తిడి చేయడం ప్రారంభించింది. అయితే దివాకర్‌కు ఆమెను వివాహం చేసుకోవడం ఇష్టం లేకపోవడంతో క్రమంగా దూరం పెట్టడం మొదలుపెట్టాడు. ఇది గ్రహించిన గీత బుచ్చిరాజుపాలెంలో నివసిస్తున్న దివాకర్ ఇంటికి వెళ్లి వివాహం చేసుకోవాలని ఒత్తిడి చేసింది. 2021 నవంబర్ 20న అతని ఇంటికి వెళ్లి.. అతని ఆఫీస్ సిబ్బంది ముందే పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చింది. దీంతో దివాకర్ తన సిబ్బందితో కలిసి ఇంటికి తాళం వేయకుండానే అక్కడి నుంచి కారులో వెళ్లిపోయాడు.

ఘోరంగా హత్య.. మృతదేహం మాయం

2021 డిసెంబర్ 26న గీత మరోసారి ద్విచక్ర వాహనంపై దివాకర్ ఇంటికి వెళ్లి పెళ్లి విషయమై గొడవపడింది. సాయంత్రం వరకు ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దివాకర్ పెళ్లికి అంగీకరించకపోవడంతో గీత ప్రతిఘటించింది. ఈ ఘర్షణలో గీత గోళ్లతో రక్కడంతో దివాకర్ ముఖం, చేతులపై గాయాలయ్యాయి. దీంతో ఆమె తనను జీవితాంతం వేధిస్తుందని భావించిన దివాకర్.. ఆమెను వదిలించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇంట్లో ఎవరు లేని సమయాన్ని తనకు అనుకూలంగా మలుచుకున్నాడు. గీతను బలంగా గోడకు గుద్ది, ప్రాణం పోయే వరకు కొట్టి చంపాడు. అదే సమయానికి హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ స్నేహితుడు వరప్రసాద్ రావడంతో, అతని సహాయంతో మృతదేహాన్ని దుప్పట్లో చుట్టి, తన ఫోర్డ్ ఐకాన్ కారు వెనుక సీట్లో ఉంచాడు. తూర్పుగోదావరి జిల్లా ఎర్రవరం వద్ద పారుతున్న ఎర్ర కాలువలో అర్ధరాత్రి ఆ మృతదేహాన్ని పడేశారు.

నేరాన్ని కప్పిపుచ్చే యత్నం

హత్య అనంతరం దివాకర్ హైదరాబాద్ వెళ్లి కొన్ని రోజులు అక్కడే ఉండి, తర్వాత నగరానికి తిరిగి వచ్చాడు. గీత తన స్నేహితులతో కలిసి అదే రోజు తిరుపతి వెళ్లిందని ఒక కథ అల్లి.. బంధువులను, కుమార్తెను నమ్మించాడు. ఆమె సెల్‌ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసి, చెన్నై తీసుకెళ్లి ఆన్ చేసి కాలువలో పడేశాడు. కొన్ని రోజుల తర్వాత గీత ద్విచక్ర వాహనాన్ని ఆమె కుమార్తెకు అప్పగించి, సహాయం చేస్తున్నట్లు ఎంతో తెలివిగా నటిస్తూ తప్పించుకు తిరుగుతున్నాడు. తాజాగా సునీత ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఈ కేసులో దివాకర్ పాత్రపై అనుమానం వ్యక్తం చేశారు. గీత బైక్‌ను ఆమె కుమార్తెకు అప్పగించడం, తిరుపతి వెళ్లిందని నమ్మించడం, తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని నిందితుడిని విచారించారు. తానే హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో తగిన సాక్ష్యాధారాలతో అరెస్ట్ చేశారు. మృతదేహాన్ని రవాణా కొరకు ఉపయోగించిన ఫోర్డ్ ఐకాన్ కారును స్వాధీనం చేసుకున్నారు. మూసివేసిన కేసును పది రోజుల్లోనే ఛేదించిన ఇన్‌స్పెక్టర్ షేక్ హుస్సేన్‌ను పోలీస్ కమిషనర్ ప్రశంసాపత్రంతో సత్కరించారు. అలాగే ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన సీసీఎస్ ఏఎస్ఐ పి.చంద్రశేఖర్, మహారాణిపేట క్రైం కానిస్టేబుల్ ఎస్.ఎ.రాజు, టూటౌన్ కానిస్టేబుల్ ఎ.వినోద్, త్రీటౌన్ కానిస్టేబుల్ వి.రామరాజులను సీపీ అభినందించారు.

రహదారిపై ఘోరం

- వైద్య విద్యార్థిని దుర్మరణం
- తండ్రి పరిస్థితి విషమం

బీచ్‌రోడ్డు: విధి ఆడిన వింత నాటకంలో వైద్య విద్యార్థిని అనంత లోకాలకు తరలిపోయింది. అటు కన్నవారికి.. ఇటు కన్నబిడ్డకు తీరని శోకాన్ని మిగిల్చింది. తగరపువలసలోని అనిల్ నీరుకొండ(ఎన్‌ఆర్‌ఐ) మెడికల్ కాలేజీలో పీజీ చదువుతున్న అదే ప్రాంతానికి చెందిన ముని లక్ష్మి జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూనే.. వైద్య విద్యను కొనసాగిస్తోంది. భర్త గతంలోనే దూరమైనా.. తన పాపకు అన్నీ తానై బాటలు వేసుకుంటోంది. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది. హైదరాబాద్‌లో జరిగే ఓ సెమినార్ కోసం శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తన తండ్రి నాగేశ్వరరావుతో కలిసి బైక్‌పై విశాఖ రైల్వేస్టేషన్‌కు బయలుదేరింది లక్ష్మి. మద్దిలపాలెం నుంచి సత్యం జంక్షన్ మధ్యలో ప్రయాణిస్తుండగా.. బైకు అదుపుతప్పి జారడంతో తండ్రీకూతుళ్లిద్దరూ రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో వెనుకనే వస్తున్న భారీ వాహనం లక్ష్మిపై నుంచి దూసుకెళ్లింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన నాగేశ్వరరావు అపస్మారక స్థితిలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదంతో లక్ష్మి పాప భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. తండ్రిని ఇప్పటికే కోల్పోగా.. ఇప్పుడు తల్లి ప్రేమకు కూడా దూరమైంది. ఈ ఘటనపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరికొంతకాలం ప్రత్యేక రైళ్ల పొడిగింపు



తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-ఎస్ఎంవీ బెంగళూరు, విశాఖపట్నం-షాలిమర్ మధ్య నడుస్తున్న స్పెషల్ రైళ్లను మరికొంత కాలం పొడిగించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖపట్నం-ఎస్ఎంవీ బెంగళూరు(08581) వీక్లీ స్పెషల్ ప్రతి ఆదివారం విశాఖలో మధ్యాహ్నం 3.20 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.45 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 29 వరకు పొడిగించారు. ఎస్ఎంవీ బెంగళూరు-విశాఖపట్నం (08581) వీక్లీ స్పెషల్ ప్రతి సోమవారం మధ్యాహ్నం బెంగళూరులో 3.50 గంటలకు బయలుదేరి.. మరుసటిరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 30 వరకు పొడిగించారు.

- విశాఖపట్నం-షాలిమర్(08508) స్పెషల్ ప్రతి మంగళవారం విశాఖపట్నంలో ఉదయం 11.20 గంటలకు బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజాము 3 గంటలకు షాలిమర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 24 వరకు పొడిగించారు. షాలిమర్-విశాఖపట్నం (08507) స్పెషల్ ప్రతి బుధవారం షాలిమర్‌లో తెల్లవారు 5 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 8.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ జూన్ 25 వరకు పొడిగించారు.

భూముల అభివృద్ధికి దిగ్గజ సంస్థ ఆసక్తి

విశాఖ సిటీ: మధురవాడలోని వీఎంఆర్డీఏకు చెందిన 87.80 ఎకరాల భూమిని ప్రైవేట్-పబ్లిక్ పద్ధతిలో సంయుక్తంగా అభివృద్ధి చేయడానికి రియల్ ఎస్టేట్ దిగ్గజ సంస్థలు ఆసక్తి చూపినట్లు వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రమేష్ తెలిపారు. ఈ భూముల అభివృద్ధి అవకాశాలను వివరించేందుకు శుక్రవారం హైదరాబాద్‌లోని రహేజా మైండ్‌స్పేస్‌లో రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షోలో జీఎంఆర్, రహేజా, సముద్ర సహా పలు ప్రధాన రియాల్టీ డెవలపర్లు పాల్గొని భూముల అభివృద్ధిపై సంసిద్ధత వ్యక్తం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ ఎస్ఈ భవానీశంకర్, ప్లానింగ్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహారాజా బ్యాంకుకు అవార్డులు


అవార్డు అందుకుంటున్న జీఎం మురళీకృష్ణ వర్మ

విశాఖసిటీ: ది మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు జాతీయ స్థాయిలో రెండు అవార్డులు లభించాయి. 'బెస్ట్ చైర్‌పర్సన్ ఆఫ్ ది ఇయర్', 'బెస్ట్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ - ఆంధ్రప్రదేశ్ స్టేట్' అవార్డులను శుక్రవారం ముంబైలో జరిగిన 'భారత్ రత్న సహకారిత సమ్మాన్ 2025' కార్యక్రమంలో అందుకున్నారు. బ్యాంకు 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ అవార్డులు రావడం సంతోషంగా ఉందని వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా 999 రోజులకు 9 శాతం వడ్డీతో 'మహారాజా స్పెషల్ డిపాజిట్ స్కీం'ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.492 కోట్లుగా, నికర లాభం రూ.3.24 కోట్లుగా వెల్లడించారు. త్వరలో విజయవాడ, రాజమండ్రి, రామచంద్రాపురంలలో కొత్త శాఖలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కొంటీ సీసీ కెప్టెన్ హరీష్ వీరవిహారం



విశాఖ స్పోర్ట్స్: వీడీసీఏ ఒకటో డివిజన్ క్రికెట్ లీగ్‌లో కొంటీ సీసీ కెప్టెన్ హరీష్ కుమార్ ఆకాశమే హద్దుగా చెలరేగి అజేయ డబుల్ సెంచరీతో (202) కదంతొక్కాడు. పీఎంపాలెంలోని వైఎస్సార్ స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో రాయల్ సీసీ జట్టుపై 307 పరుగుల భారీ తేడాతో కొంటీ సీసీ విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కొంటీ సీసీ నిర్ణీత 40 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 367 పరుగులు చేసింది. ఓపెనర్ దేవాశిష్ 75 పరుగులు చేయగా చరణ్ 61 పరుగులతో రాణించాడు. కెప్టెన్ హరీష్ 15 ఫోర్లు, 12 సిక్సర్లతో చెలరేగాడు. నవవసంత్ రెండు వికెట్లను తీశాడు. ప్రతిగా రాయల్ సీసీ 21.5 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 60 పరుగులే చేసింది. శివ మూడు, ఆదిత్య రెండు వికెట్లు తీశారు.

డ్రైవర్‌కు ఏడాది జైలు, జరిమానా

విశాఖ లీగల్ : బస్సును నిర్లక్ష్యంగా నడిపి వృద్ధురాలి మృతికి కారణమైన ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్‌కు మెట్రోపాలిటన్ ప్రధాన మెజిస్ట్రేట్ ఎం. ప్రదీప్ కుమార్ శుక్రవారం ఏడాది జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. అదనపు సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాల ప్రకారం.. 2023 సెప్టెంబర్ 29న వాల్తేరు డిపోకు చెందిన 48ఏ బస్సు లక్ష్మీటాకీస్ జంక్షన్ వద్ద ఆగింది. వృద్ధురాలు బోనంగి రావులమ్మ బస్సు ఎక్కుతుండగా, డ్రైవర్ చూసుకోకుండా బస్సును ముందుకు పోనిచ్చాడు. దీంతో రావులమ్మ కిందపడి తీవ్ర గాయాలపాలైంది. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమార్తె కోట్ల నారాయణమ్మ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ శిక్షాస్మృతి 304 ఏ కింద డ్రైవర్‌పై నేరాభియోగపత్రాన్ని దాఖలు చేయగా, నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ తీర్పునిచ్చారు. మృతురాలికి పరిహారం కోసం న్యాయ సేవా ప్రాధికార సంస్థను ఆశ్రయించాలని న్యాయమూర్తి సూచించారు.

చిట్టీల సొమ్ముతో పరారైన మహిళపై ఫిర్యాదు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక, శ్రీనగర్ అఫీషియల్ కాలనీకి చెందిన మధునూరి చిట్టమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి స్థానికుల నుంచి రూ. కోటి 54 లక్షల వరకు చిట్టీల సొమ్ము వసూలు చేసి పరారైనట్లు బాధితులు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు నెలలుగా ఆమె కనిపించకుండా పోవడంతో, కణితి రోడ్డుకు చెందిన వెంకట తేజ అనే వ్యక్తి, తనకు చిట్టమ్మ రూ. 20 లక్షల వరకు బాకీ ఉందని మరికొందరు బాధితులతో కలిసి ఫిర్యాదు చేశారు. గాజువాక సీఐ అలహరి పార్థసారథి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'అమృత్ భారత్' పనులు వేగవంతం

అధికారులకు వాల్తేర్ డీఆర్ఎం ఆదేశం


డీఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు ఈశ్వర్, తదితరులు

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో అమృత భారత్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బొహ్రా, సీనియర్ డీసీఎం సందీప్‌లతో కూడిన బృందం పరిశీలించింది. ముందుగా డీఆర్ఎం ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం వైపు నిర్మిస్తున్న ప్రధాన పరిపాలన భవన నిర్మాణాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఒకటి, నాలుగు ప్లాట్‌ఫాంలను కలుపుతూ నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించి, వాటి పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. తర్వాత ప్లాట్‌ఫాం నంబర్ నాలుగు వైపు జరుగుతున్న సుందరీకరణ, రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం అధికారులతో మాట్లాడుతూ నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డీఆర్ఎంను కలిసి ఇక్కడి సమస్యలపై వినతపత్రం సమర్పించారు. విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ రైలులో శాశ్వత ప్రాతిపదికన థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ కోచ్‌లు ఏర్పాటు చేయాలని, కోచ్‌లకు నీటి సరఫరా సౌకర్యం కల్పించి సిబ్బందిని నియమించాలని, ఎస్కలేటర్లు, లిఫ్టులను ఏర్పాటు చేయాలని వారు కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జాషువా, కామేశ్వరరావు ఉన్నారు.

మాస్టర్‌ప్లాన్‌కు అభిప్రాయాలు తెలపండి

విశాఖ సిటీ: వీఎంఆర్డీఏ రూపొందించిన బృహత్ ప్రణాళిక-2041ని పరిశీలనకు ప్రభుత్వం అనుమతించిందని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు. జూన్ 21 వరకు ప్రజలు తమ అభిప్రాయాలు, సలహాలను తెలియజేయవచ్చని ఆయన సూచించారు. ఆసక్తి గల వారు వీఎంఆర్డీఏ కార్యాలయం 7వ అంతస్తులో స్వయంగా గానీ, పోస్ట్ ద్వారా గానీ, లేదా vmrda.gov.in/ objections వెబ్‌సైట్ ద్వారా గానీ తమ సూచనలను సమర్పించవచ్చన్నారు.